# శ్రీరాముడి మూర్ఛ

లంకాధీశుని హతమార్చి సీతను చెర విడిపించాడు శ్రీరామచంద్రమూర్తి.

"అయ్యో! సీతా! నా చెలీ! ఎంతగా మారిపోయావు? నీ దర్శన భాగ్యం ఈ నిర్భాగ్యుడి కెన్నాళ్ళక్కలిగింది!" అన్నాడు శ్రీరామచంద్రమూర్తి దూరం నుంచే-

సీత విరహంతో తన ప్రభువు కోసం తపన పడుతోంది. శ్రీరాముడు చేతులు చాచి తన కౌగిట్లోకి లాక్కుంటాడనుకుంది అమాయకురాలు.

"అదేమిటి ప్రభూ అలా అంటున్నారు? అశోకవనమనే ఖైదులో ఉన్న నేను నిర్భాగ్యురాలిని కాని, తమరు కాదు, రండి ప్రభూ! అందుకోండి నా మేను తమకోసం పరితపిస్తూంది!"

"వద్దు సీతా! తొందరపాటు వద్దు. నీ శరీరపు తపనను, తహతహను కొంచెం ఆపుకో" అన్నాడు శ్రీరామచంద్రుడు.

'సీత నివ్వెరపోయింది.

"అదేమిటి స్వామీ! అలా అంటున్నారు. తమరలా అనడానిక్కారణం? వియోగ భారంతో నిండిన నా శరీరం, తమ కోసం ఇంకా నిరీక్షించగలదా?"

"కొంచెం ఆగు సీతా! నాకో వ్రతముంది. ఆ వ్రతం పూర్తయ్యేవరకూ నిన్ను తాకరాదని గురువాజ్ఞ!" అన్నాడు శ్రీరామచంద్రమూర్తి.

"గురువర్యుల ఆజ్ఞా! హా నాథా ఎంత మాటన్నారు. ఎంచేత తమను తాకకూడదో సెలవియ్యండి ప్రభూ!" అంది గద్గద కంఠంతో.

"నేను చెప్పలేను సీతా! ఆ కారణం గురువర్యులైన వసిష్ఠుల వారే చెప్పాలి. నా నోరు మూగపోయింది."

"అదేమిటి స్వామీ! మీరే చెప్పాలి. చెప్పకపోతే తక్షణమే, ఎదురుగా కనిపిస్తున్న

అగ్నిలో దూకి దగ్ధమై పోతాను" అంది సీత.

"అదేనమ్మా సీతా మాక్కావలసింది. నువ్వు అగ్నిలో ప్రవేశించడమే మాకవసరం" అన్నారు వసిష్ఠులవారు మధ్యలో జోక్యం చేసుకుంటూ—

"హేతువేమిటో సెలవిస్తారా గురువర్యులు?" ప్రశ్నించింది సీత.

"ఎందుకంటావా? నీవు అనేక దినాలు రావణబ్రహ్మ వద్ద ఉన్నావు. ఆ క్రూరుడు నిన్ను అశోకవనంలో బలాత్కారం చేసినట్టు తెలిసింది. అతడు నిన్ను చెరలో చెరచేడేమోనని మా అనుమానం" అన్నారు వసిష్ఠులవారు.

"అగ్నిలో ప్రవేశిస్తే మీ సందేహ నివృత్తి ఎలా అవుతుందో సెలవియ్యండి గురువర్యా!"

"నువ్వే పతివ్రతవైతే అగ్నిలో దహనం కావు. లేకపోతే దహనమై పోతావు!"

"తప్పు గురుదేవా! మీరలా సీతామాతను పరీక్షించడం ధర్మంకాదు!" అన్నాడు ఇంతలో హనుమంతుడు జోక్యం చేసుకొని.

"లేదు హనుమాన్, గురువాజ్ఞను ధిక్కరించరాదు" శ్రీరామచంద్రమూర్తి.

"క్షమించు రామా! ఈ సందర్భంలో సీతామాతను అగ్ని ప్రవేశం ద్వారా పరీక్షించడం అక్రమం! అన్యాయం! మిమ్మల్ని ధిక్కరిస్తున్నందుకు మన్నించాలి!"

"ఆంజనేయా! నువ్వీ విషయంలో అడ్డు తగలకూడదు. సీత అగ్నిలో ప్రవేశించి తీరాలి" అన్నారు వసిష్ఠులవారు కఠినంగా.

"ఆ మాటకొస్తే ముందు శ్రీరాములవారే అగ్నిలో ప్రవేశించాలి!" అన్నాడు ఆంజనేయుడు.

"అదేమిటి వాయుపుత్రా! భర్త అగ్నిలో ప్రవేశించడం ఎక్కడైనా ఉందా?" అన్నారు వసిష్ఠులవారు.

"లేకపోవచ్చును కాని మనం అవలంబించాలి!" అన్నాడు ఆంజనేయుడు.

"శ్రీరాముడే అగ్నిలో ఎందుకు ప్రవేశించాలో సహేతుకంగా నిరూపించు" అడిగారు వసిష్ఠులవారు.

"తప్పక" అన్నాడు హనుమంతుడు.

"సీతామాతకు శీలభంగం అయిందేమో అనే కదా ఆమెను అగ్నిలో ప్రవేశించమన్నారు? అలాగైతే సీత తన వద్ద లేనప్పుడు ఒంటరిగా ఉండలేక అతను ఏ పర స్త్రీతో సంచరించాడో ఎవరికి తెలుసు? ఆడది చెంత లేకుంటే ముందు చెడేది మొగాడే? అంచేత శ్రీరాముని శీలం పరీక్షించడాన్కి అగ్ని ప్రవేశం అవసరం"

"ఎంత ఘోరం!" అంటూ మూర్ఛపోయాడు శ్రీరాముడు.

*'జ్యోతి' మంత్లీ, 1979*